క్లుప్తంగా

జాబ్‌మేళాను ఉపయోగించుకోండి

దర్శి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న నిర్వహించే మెగా జాబ్‌మేళాను ఉపయోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పీటీఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాలో మాన్యుఫాక్చరింగ్, మెడికల్–ఫార్మాస్యూటికల్, రిటైల్, టెలీకాలింగ్ వంటి ప్రధాన రంగాల నుంచి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, బీటెక్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు గోపీకృష్ణ 88979 64505, ఫిరోజ్‌గాంధీ 70139 50097, కమాండ్ కంట్రోల్ నంబర్లు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

దొనకొండ (కురిచేడు): దొనకొండలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ బి.రమాదేవి, మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ గురువారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్ వాయిస్‌లు తనిఖీ చేశారు. అవసరమైన రైతులకు మాత్రమే యూరియా ఇవ్వాలని, ఇతర ప్రాంతాల వారికి అమ్మవద్దని సూచించారు. ఎంఆర్‌పీకి మించి అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపు యజమానులకు సూచనలు, సలహాలు అందజేశారు.

భూములు దక్కే వరకూ ఉద్యమిస్తాం..



భూముల్లోకి వచ్చి మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ముండ్లమూరు (దర్శి): కష్టజీవులకు భూములు దక్కే వరకూ ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం కెల్లంపల్లిలో సాగు భూముల సాధన కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్ర జెండాలతో భూములు దున్ని, విత్తనాలు చల్లి సాగుకు దిగారు. కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ భూముల్లో హక్కులు దక్కే వరకు, పంటలు చేతికొచ్చే వరకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు, రైతు సంఘ మండల కార్యదర్శి వంటా ఏడుకొండలు, సీనియర్ నాయకులు బోడపాటి హనుమంతరావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, వ్యవసాయ కార్మిక సంఘ మండల అధ్యక్ష కార్యదర్శులు గోగుల నారాయణ, పొట్లూరి రామాంజనేయులు, మండల నాయకులు ఎం.దాసు, గాలి వెంకటేశ్వర్లు, మేకల హనుమంతరావు, పి.సుబ్బారావు, పి.వెంకటేశ్వర్లు, పి.హనుమయ్య, వల్లపు అంజమ్మ, చల్లా సీతమ్మ, వి.రంగనాథ్, నాగరాజు, జె.రవి, ధనభాగ్యం, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కొలువుదీరిన గణనాథులు

- వీధివీధినా వినాయక విగ్రహాలు
- గ్రామాలు, పట్టణాల్లో సందడి
- మట్టి గణపతి ప్రతిమలు అందించిన స్వచ్ఛంద సంస్థలు



పెద్దదోర్నాల: ఐనముక్కలలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



త్రిపురాంతకం: వినాయకునికి ప్రత్యేక పూజలు

దర్శి:

నియోజకవర్గంలో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో వీధి వీధికీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పట్టణంలోని కొత్తపాలెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆ పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి పూజలు చేశారు. అద్దంకి రోడ్డు, పొదిలి రోడ్డు, కురిచేడు రోడ్డులో భారీ వినాయక విగ్రహాలు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక మట్టి విగ్రహాలను డీఎస్పీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్, లయన్స్ ఆఫ్ దర్శి టౌన్ స్నేహ ఆధ్వర్యంలో సీఐ రామారావు చేతుల మీదగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

యర్రగొండపాలెం: వినాయక చవితి పండుగను భక్తులు బుధవారం వైభవంగా జరుపుకున్నారు. మట్టి వినాయక బొమ్మలను తీసుకెళ్లి తమ గృహాల్లో పూజలు చేశారు. పట్టణంలోని ఆంజనేయ స్వామి గుడి సెంటర్, కొలుకుల సెంటర్, పుల్లలచెరువు రోడ్డు, భారతీయ స్టేట్ బ్యాంక్, రాములవారి గుడి, బీసీ కాలనీ, మాచర్ల రోడ్, పడమటి బజార్, ఒంగోలు వారివీధి తదితర ప్రాంతాలతో పాటు గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆంజనేయ స్వామి గుడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేషుడి పూజా కార్యక్రమం సందర్భంగా వచ్చిన మహిళా భక్తులకు ప్రసాదంతో పాటు హాట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. కొలుకుల సెంటర్‌లో ఫ్రెండ్స్ సర్కిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి భక్తులు పూజలు చేసి తమ కోర్కెలు నెరవేర్చాలని కోరుకున్నారు.

పెద్దారవీడు: మండలంలో వినాయక చవితి పండగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వినాయక స్వామి వద్ద పత్రిక, కాయలు, పుస్తకాలు, నైవేద్యం సమర్పించారు. గురువారం ఉదయాన్నే చిన్నారులు వినాయక స్వామిని గ్రామం సమీపంలో ఉన్న చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

పెద్దదోర్నాల: మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం తెల్లవారు జాము నుంచే వివిధ దేవాలయాల్లో ఆది దేవునికి తమ విఘ్నాలు తొలగి శుభాలు చేకూరాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంట్లో చిన్న వినాయకుని ప్రతిమను తెచ్చుకుని 21 రకాల ఆకులతో పూజించటం విశేషం. వినాయకునికి ప్రత్యేక అర్చనలు చేశారు. వెచ్చా వెంకట సుబ్బయ్య వీధి, ఇందిరా నగర్, ప్రభుత్వ వైద్యశాల, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, వినాయకనగర్, సీతారామనగర్, రంగ హాస్పటల్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

తాళ్లూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు బుధవారం వినాయక చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా యువకులు ఐక్యంగా మందిరాలు ఏర్పాటు చేసి గణనాథుల విగ్రహాలు కొనుగోలు చేశారు. దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు.

పుల్లలచెరువు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణనాథులు వాడవాడలా కొలువుదీరారు. బుధవారం మండల కేంద్రం కమ్మవారిపల్లి, గంగవరం గ్రామాలు, హరిజనవాడ, ముతరాసు కాలనీ, బ్రహ్మం గారి వీధి, యాదవ బజార్, లంబాడ తండాలో వివిధ ఆకారాలతో గణనాథులు కొలువుదీరారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండపాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

త్రిపురాంతకం: వినాయక చవితి సందర్భంగా గణపతి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. త్రిపురాంతకంలోని కార్యసిద్ధి గణపతి మందిరం, త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద చామరకర్ణ వరసిద్ధి వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద, గ్రామ కూడళ్లలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



వై.పాలెంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



దర్శి: కొత్తపాలెం వినాయకునికి పూజలు చేస్తున్న వెంకటరెడ్డి



దర్శి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న సీఐ రామారావు



పుల్లలచెరువు: గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

అమరులకు నివాళులు



దర్శి: మాట్లాడుతున్న తాండవ రంగారావు

యర్రగొండపాలెం: విద్యుత్ అమర వీరులకు గురువారం ఘనంగా నివాళులర్పించారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా 2000 సంవత్సరం ఆగస్టు 28న హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలు అశువులు బాశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో స్థానిక పూల సుబ్బయ్య విగ్రహం వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి 14 నెలల కాలంలో రూ.15,485 కోట్లు ప్రజలపై భారం మోపి మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం తిరిగి రూ. 12,717 కోట్ల భారాన్ని మోపటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని, ఈ భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు గతంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయా పార్టీల నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, సోమయ్య, షేక్ అమీర్‌బాషా, షేక్ హిదాయతుల్లా, టి.అంజి, కోటేష్, కొండయ్య, వీరయ్య, యోగయ్య పాల్గొన్నారు.

దర్శి: ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచడానికి వ్యతిరేకంగా అదానీ స్మార్ట్ మీటర్లపై పోరాటం చేద్దామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు తాండవ రంగారావు పిలుపు నిచ్చారు. 2000 సంవత్సరంలో జరిగిన పోరాటంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ముగ్గురు పోలీసుల తుటాలకు బలయ్యారని, ఆ అమరవీరుల బలిదానం స్ఫూర్తితో అదానీ స్మార్టు మీటర్లుకు, ట్రూ అప్ చార్జీలకు, విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేంగా పోరాడతామని చెప్పారు. అమరవీరులైన బాలస్వామి, ఎస్.రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు గడియారం స్తంభం సెంటర్‌లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు తాండవ రంగారావు, వామపక్ష నాయకులు రాచపూడి కరుణానిధి, సందు వెంకటేశ్వరరావులు నివాళులర్పించారు. సీపీఐ నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, కేవీ పిచ్చయ్య, ఉప్పు నారాయణ, షేక్ కాలేబాషా, తాండవ లక్ష్మి, పద్మావతి, సందు రంగమ్మ, చిట్లా ఆదినారాయణ, గర్నిపూడి జాన్, ఎం.యలమందారెడ్డి, ఇత్తడి కోటయ్య, రామకోటిరెడ్డి, ఉప్పు మోహన్‌రావు, అంజిబాబు, గోగు వెంకయ్య పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తామని సీపీఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు అన్నారు. ముండ్లమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ అమరవీరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల చిత్రపటాలకు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోడపాటి హనుమంతరావు, సత్యం వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, హనుమయ్య, తిరపతయ్య, ఇర్మియా, శీను, ఏలియా, సుబ్బారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

అర్హత ఉన్న దివ్యాంగులకు పింఛన్ మంజూరు చేయాలి



ర్యాలీ చేస్తున్న దివ్యాంగులు

యర్రగొండపాలెం: అర్హత ఉన్న ప్రతి ఒక్క దివ్యాంగుడికి పింఛన్ మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆ సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెరిఫికేషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని, రీ అసెస్‌మెంట్‌లో దివ్యాంగులకు గతంలో ఇచ్చిన సర్టిఫికెట్‌లో ఉన్న వికలత్వ శాతం తగ్గించడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు జి.వినయ్ మాదిగ, పోలేపల్లి పెద్ద పాలంకయ్య, కణమాల కోటేశ్వరరావు, డి.పరంజ్యోతి, కె.శ్రీను, బి.బ్రహ్మారెడ్డి, టి.వెంకటేశ్వర్లు, షేక్ నాసర్‌వలి పాల్గొన్నారు.

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



తూర్పు వీరాయపాలెంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

దర్శి: మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబే.. అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని చెర్వుకొమ్ముపాలెం, తూర్పు వీరాయపాలెం, బొట్లపాలెం, పాతకమూరు, పాపిరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు, ఎన్నికలు అయిపోయిన తర్వాత అమలు చేయకుండా చేస్తున్న మోసాలను బట్టబయలు చేస్తూ క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డులతో గ్రామంలో ప్రజలకు వివరించారు. గ్రామాల్లో చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 143 హామీలు ఇచ్చి సీఎం అయ్యాక ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా నిస్సిగ్గుగా అదిచేస్తాం.. ఇది చేస్తాం..అంటూ కల్లబొల్లి మాటలు చెప్తున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించి రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడం, ఆస్తులు ధ్వంసం చేయడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి అప్పులు సృష్టించే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు. దేశంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో మొదటి స్థానంలో సీఎం చంద్రబాబే ఉన్నారన్నారు. పాలన అంటే మాట తప్పని మడమ తిప్పని నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న అందించిన సంక్షేమ ఫలాలను ఇప్పటికీ ప్రజలు గుర్తు పెట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సర్పంచ్ బొట్ల వెంకయ్య, కౌన్సిలర్ తుళ్లూరి బాబూరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అమీన్‌బాషా, నాయకులు అన్నవరపు రవి, ఇరుగుల శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, శ్రీను, మాజీ ఎంపీటీసీ ముప్పరాజు శ్రీను, అమరా సీతయ్య, శ్రీను, ముప్పరాజు వెంకటేశ్వర్లు, మధుమంచి వెంకటేశ్వర్లు, మేరగపూడి చిన్న బ్రహ్మయ్య, నలమోలు మోహన్ చౌదరి పాల్గొన్నారు.



బొట్లపాలెంలో..

నేత్రదానం చేయండి

దర్శి: నేత్రదానం చేసి మరొకరి జీవితంలో వెలుగులు నింపాలని డాక్టర్ అబ్దుల్ కలాం అన్నారు. ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక దర్శి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెడికల్ సూపరింటెండెంట్ సుమన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అబ్దుల్ కలాం మాట్లాడుతూ ఒకరు నేత్రదానం చేస్తే ఇద్దరికి చూపు అందించ వచ్చన్నారు. ఏ వ్యక్తి అయినా చనిపోయిన 6 గంటల్లోపు వారి కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను సేకరించి ఐ బ్యాంకులో భద్రపర్చాలన్నారు. కలెక్టర్, జిల్లా వైద్యాధికారి, అంధత్వ నివారణ సంస్థ మేనేజర్‌ల ఆదేశాల మేరకు కరపత్రాలు విడుదల చేశారు. రేడియోగ్రాఫర్ వెంకటేశ్వర్లు, ఆప్తమాలజిస్ట్ నరసింహారావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కురిచేడు: మండల కేంద్రం కురిచేడులో ఎరువులు, పురుగు మందుల షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్థానిక మండల వ్యవసాయాధికారులతో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా లైసెన్స్‌లు, ఇన్‌వాయిస్‌లు, భౌతిక నిల్వలు, స్టాక్ రిజిష్టర్‌లు, టీబీటీ మిషన్‌లోని స్టాక్‌ను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 7655 మెట్రిక్ టన్నులకు వాటి ధర రూ.1,52,563, అలాగే విత్తనాలు 125 కేజీలు వాటి ధర రూ.48,312 అమ్మకాలు నిలుపుదల చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.అపర్ణ, వ్యవసాయాధికారి కె.శివనాగప్రసాద్, స్థానిక ఏఓ బి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

తాళ్లూరు: అదుపుతప్పి టిప్పర్ బోల్తా కొట్టిన సంఘటన బుధవారం తెల్లవారు జామున సోమవర్పాడు పరిధిలోని దర్శి–చీమకుర్తి ప్రధాన మార్గాన సబ్‌స్టేషన్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గ్రావెల్ తరలిస్తున్న సమయంలో లారీ స్టీరింగ్ గట్టిగా పట్టుకుపోవడంతో ప్రమాదం జరిగింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.